క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య, కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి, ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డీవీ నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568 286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు: కక్షిదారులు చిన్న చిన్న కేసులను రాజీ చేసుకోవడమే రాజమార్గమని జమ్మలమడుగు జూనియరు సివిల్‌కోర్ట్ జడ్జీ ఎస్. భార్గవి అన్నారు. శనివారం కోర్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు గ్రామాల్లో గొడవలు పడి కేసులు పెట్టుకోవడం వల్ల డబ్బులతో పాటు కాలయాపన జరుగుతుందన్నారు. కక్షిదారులు రాజీ అయితే ఎటువంటి సమస్య ఉండదని ఆమె సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1630 కేసులు పరిష్కరించి రూ.1,08,40,064 లు సెటిల్‌మెంట్ అయినట్లు తెలిపారు. డీఎస్పీ నాగరాజు, సిఐ సదా శివయ్య, ఎస్ఐలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వృషభాచలేశ్వరునికి విశేష పూజలు



పూజలందుకుంటున్న శ్రీలక్ష్మి వృషభాచలేశ్వర స్వామి

వేంపల్లె : స్థానిక పాపాఘ్నినది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మి వృషభాచలేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ. శ్రీధర్, చైర్మన్ కురాకుల వెంకటేష్ తెలిపారు. శ్రావణమాసం నాల్గవ శనివారం పురస్కరించుకొని స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు హరిప్రవీణ్ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్లు లక్ష్మిరెడ్డి, దాసిరెడ్డి పాల్గొన్నారు.

నేడు సెమినార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వ్యవసాయ సంక్షోభం పరిష్కార మార్గాలపై ఆదివారం సెమినార్ నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కడప పాత బస్టాండ్ వద్దగల సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి స్వాతంత్య్ర పోరాట యోధుల చిత్రాల ప్రదర్శన

కడప వైఎస్ఆర్‌సర్కిల్ : భారతదేశ స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని విశేష సేవలు అందించిన పోరాట యోధుల చిత్ర పటాల ప్రదర్శనను ప్రతి ఒక్కరూ తిలకించాలని పలువురు నగర ప్రముఖులు పిలుపునిచ్చారు. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కడప నగరంలోని నూరే జహాషాది ఖానా లో ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు 350 మంది స్వతంత్ర పోరాట యోధుల చిత్రపటాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనను డిప్యూటీ సీఎం అంజాద్ బాష, కడప నగర మేయర్ సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ప్రారంభించనున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్, అమీన్ హాస్పిటల్ ఎండి నయీమ్ బాష, సిటీ లాడ్జ్ ఎండి షామీర్ బాష, ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కమలాపురం: ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం కోగటం, కంచన్నగారిపల్లె, చెన్నపురెడ్డిపల్లె గ్రామాల్లో మాజీ సర్పంచ్ కరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఆయన హాజరయ్యారు. గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, విద్యుత్ స్తంభాలు కావాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.అర్హులుగా ఉన్నప్పటికి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, సత్యంరెడ్డి, క్రిష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, మస్తానయ్య, నిఖిల్‌రెడ్డి, స్థానిక నాయకులు సిద్ధారెడ్డి, ఆంజనేయులు, నారాయణ, సుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

వీరపునాయునిపల్లె: సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం వీరపునాయునిపల్లె మండలంలోని ఇందుకూరు పంచాయతీ పరిధిలోని అయ్యవారిపల్లెలో 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలో పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. అంతే కా కుండా అన్ని శాఖలకు సంబంధించిన అధికారులను నియమించడంతో పాటు ప్రభుత్వం చేపట్టబో యే సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయడం , ఆ పథకాలకు అర్హులను గుర్తించి వాటిని వారికి అందించేందుకు ప్రతి 50కుటుంబాలకు ఒక్కో వలంటీర్‌ను నియమించారన్నారు. ఏపీపీఎస్సీ బోర్డు మెంబరు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

వీరపునాయునిపల్లె: మండలంలోని సంగాలపల్లె గ్రామం వద్ద వేంపల్లె, యర్రగుంట్ల ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సప్తగిరి లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని సంకల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన నారాయణరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న మాదిగ సంఘం నాయకులు

జమ్మలమడుగు: ఈ పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీవర్గీకరణ చేసి చట్టబద్ధతను కేంద్ర ప్రభుత్వం కల్పించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పిచుకె బాబు డిమాండ్ చేశారు. శనివారం పాత బస్టాండ్‌లోని తాడిపత్రి రహదారిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీవర్గీకరణ కోసం దళిత సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ చేస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వతం హామీ ఇచ్చి 9 సంవత్సరాలు అయినా ఇంత వరకు అమలు చేయకుండా తాత్సరం చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో సింగరయ్య, చిన్నయ్య నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు పాటు పడాలి



నర్సులకు శిక్షణ ఇస్తున్న ప్రోగ్రామ్ అధికారులు

జమ్మలమడుగు: ఆరోగ్య సిబ్బంది తల్లి, శిశు సంరక్షణకోసం పాటు పడాలని ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.సుప్రిత పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని సిబ్బందికి నర్సులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేసే ఏఎన్ఎంలకు తల్లీ బిడ్డల సంరక్షణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు ప్రతి నెలా వైద్య పరీక్షలను నిర్వహించాలని సూచించారు. ఏఎన్ఎంలు ప్రతి రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి వర్షాకాలంలో పిల్లలకు తీసుకోవలసిన జాగ్రత్తలతోపాటు తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మంచినీటిని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రక్షిత మంచి నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం మైలవరం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిధుల కింద రూ.7 లక్షల రూపాయలతో ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సావిత్రి, రాష్ట్ర హస్త కళల చైర్మన్ బడిగించల విజయలక్ష్మీ, ఉపాధ్యక్షుడు బి. రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, రామాంజనేయ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బడిగించల చంద్రమౌళి సుబ్బిరెడ్డి, వేణుగోపాల్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో తొగట వీరక్షత్రియ కళ్యాణ మండపానికి భూమిపూజ నిర్వహించారు. శనివారం ఈ భూమి పూజ కార్యక్రమానికి వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తొగట వీరక్షత్రియ రాష్ట్ర అధ్యక్షుడు మోడం వీరాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఒక ఎకరా స్థలాన్ని కళ్యాణ మండపానికి కేటాయించడం వల్ల ఇక్కడ భూమిపూజ చేశామన్నారు. మూడుకోట్ల వ్యయంతో ఇక్కడ కళ్యాణ మండపం నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తొగట వీరక్షత్రియ కులాల అభివృద్ధికి ఎంతో కృషిచేస్తోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, జాతీయ ఉపాధ్యక్షులు బండారు రఘురామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు, మండల అధ్యక్షులు డక్కా శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు కొరముట్ల సుబ్బరాయుడు, రాష్ట్ర మైనింగ్ శాఖ డైరెక్టర్ సల్మా, ఎంపీటీసీ భారతి, వార్డు మెంబర్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు గంగయ్య, సుబ్బారావు, చంద్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై కడప రాయుడు



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తొలుత మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించి ఆ ప్రాంగణంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పంచామృతాభిషేకం, ఇతర పరిమళ ద్రవ్యాలతో అభిషేకించి కనుల పండువగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను పల్లకీపై తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్ గ్రామోత్సవంలో భక్తులకు హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు స్వామిని మనసారా దర్శించుకుని పూజలు నిర్వహించారు.

అన్నదానం గొప్పది

వేంపల్లె: అన్ని దానాలలో అన్నదానం గొప్పదని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి పేర్కొన్నారు. శ్రావణమాసం నాల్గవ శనివారాన్ని పురస్కరించుకుని వేంపల్లె బైపాస్‌లో ఉన్న సాయిరజిత ఫిల్లింగ్ స్టేషన్ నందు మాజీ సర్పంచ్ మాచిరెడ్డి రాధికా రెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలుమూలల ఉన్న జిల్లాల నుంచి గండిక్షేత్రానికి నడుచుకుంటూ వస్తున్న భక్తులకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న నాగెళ్ల సాంబశివారెడ్డి

వేముల : వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ నాగెళ్ల సాంబశివారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం వేములలో ఘనంగా జరిగాయి. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో జెడ్పీటీసీ కె.వెంకటబయపు రెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డిలతో కలిసి మండల ఇన్‌చార్జ్ సాంబశివారెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, సొసైటీ అధ్యక్షులు పేరం గంగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రవీంద్రా రెడ్డి, సర్పంచ్ అర్జున, మాజీ ఎంపీటీసీలు చంద్రశేఖర్ రెడ్డి, మలిరెడ్డి పాల్గొన్నారు.

జన వాక్కు



కంచే చేను మేసిందన్నట్లు .. అవినీతిని అడ్డుకోవాల్సిన బడాబాబులే ఇలా అడ్డగోలుగా పచ్చగడ్డి మేస్తారా.. అంటూ జనాలు మండిపడుతున్నారు. ప్రజా ధనాన్ని పక్కదారి పట్టించిన చంద్రబాబు తీరు చూసి నోరెళ్లబెడుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబును పక్కా ఆధారాలతో అరెస్ట్ చేయడంపై స్వాగతిస్తున్నారు. తప్పు చేసిన వారెవరికైనా శిక్ష తప్పదన్నారు. -జమ్మలమడుగు/పులివెందుల రూరల్/చెన్నూరు

తప్పులు చేయడం బాబుకు అలవాటే



తప్పులు చేయడం ..వ్యవస్థలను అడ్డుపెట్టుకుని తప్పించుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిపోయింది. నోటుకు నోటు కేసులో సాక్ష్యాలతో దొరికిపోయిన రాత్రికి రాత్రే తెలంగాణ నుంచి ఏపీకి వచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లోనే కాదు ఎందులోనైనా నిజంగా తప్పు చేయకుంటే స్టేలు కోరకుండా చంద్రబాబు నాయుడు తన నిజాయితీని నిరూపించుకోవాలి.

–మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, జమ్మలమడుగు

నిజాయితీ నిరూపించుకో బాబూ..



యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పేరుతో వందల కోట్ల రూపాయలు చంద్రబాబు నాయుడు అక్రమాలకు పాల్పడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజాధనమైన 351 కోట్ల రూపాయలు పక్కదారి మళ్లించింది.ప్రస్తుతం ఆ కంపెనీలు లేవని సీఐడీ అధికారులు చెబుతున్నారు. ఇన్నాళ్లు చంద్రబాబు నాయుడు చేసిన తప్పులను తప్పించుకుంటూ తిరుగుతున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

వి. హృషికేశవరెడ్డి, కన్నెలూరు,జమ్మలమడుగు.

పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు



తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును పక్కా ఆధారాలతోనే సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో సుమారు రూ.370కోట్లకు అవినీతికి పాల్పడ్డారు. అందువల్ల సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతోనే అరెస్టు చేశారు. తప్పు చేసిన వారు ఎంతటివారైనా శిక్షపడక తప్పదు.

రాజు, స్నేహితఅమృతహస్తం అధ్యక్షుడు

ప్రజా సొమ్ము దోపిడీ దారుణం



ప్రజల సొమ్మును దోపిడీ చేస్తే ఎటువంటి వారైనా బాగుపడరు. స్కిల్‌డెవలప్మెంట్ పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బాబుకు తగిన శిక్ష వేయాలి. ఒక ఉన్నతమైన హోదాలో ఉండి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన చంద్రబాబును అరెస్టు చేయడంలో సీఐడీ అధికారులు ఆలస్యంగా అయినా మంచి నిర్ణయం తీసుకున్నారు.

–జనార్దన్ రెడ్డి , వికలాంగుల సేవకుడు

అవినీతికి పాల్పడిన వారు శిక్షార్హులు



తప్పు చేసినప్పటికీ ఎప్పటికప్పుడు కోర్టుకెళ్లి అరెస్టు కాకుండా స్టేలు తెచ్చుకోవడం చంద్రబాబుకు అలవాటే. పైగా ఇతరుల మీద బురద జల్లడం చేస్తుంటారు. ఆయన చదువుకునే రోజుల్లో 2 ఎకరాల భూమితో ఉండే చంద్రబాబు నాయుడు నేడు కోట్లాది రూపాయలకు అధిపతి ఎలా అయ్యాడో అందరికీ తెలిసిన విషయమే. ఎప్పుడూ తను నిప్పు అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ఇప్పుడు తానేంటో రుజువు చేసుకోవాలి.అధికారులకు సహకరించి తానేంటో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

– సుబ్బరాయుడు, ముండ్లపల్లె,చెన్నూరు

బాబు అరెస్టును స్వాగతిస్తున్నాం



తప్పు చేసిన వారు ఎంతటి వారి కైనా శిక్ష తప్పదు. తప్పులు చేసి తప్పించుకోవడంలో చంద్రబాబు నాయుడు దిట్ట. ఎలాంటి అడ్డదారులు తొక్కకుండా నిజాయితీగా అలా వేలాది కోట్లు ఎలా సంపాదించారో, సామాన్య ప్రజలకు కూడా తెలియజేస్తే మంచిది. తప్పు చేసి కూడా నేను నిప్పు...నేను సత్యహరిచంద్రుని అని చెప్పుకోవడం సిగ్గుచేటు. నీచ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు. ఆయనను అరెస్టు చేయడం సబబే. ఇంకా ఏయే పనులలో ఎంతెంత ముడుపులు చెందాయో, అధికారులు విచారించాలి.

– సుబ్బరామయ్య, షుగర్ ఫ్యాక్టరీ. చెన్నూరు

వైభవంగా శ్రావణమాస పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీ చెన్నకేశవ స్వామి



పుష్పగిరిలో క్యూ లైన్‌లో భక్తులు



సింధూర అలంకరణలో అభయ ఆంజనేయస్వామి



వీఎన్ పల్లె: అంజన్న గ్రామోత్సవం

వల్లూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో శ్రావణ మాసం నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి స్వామి వారిని, లక్ష్మీ దేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని పలు గ్రామాలలో ఆంజనేయ స్వామి ఆలయాలలో పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

అంజన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పులివెందుల టౌన్ : శ్రావణ మాసోత్సవాలలో భాగంగా నాల్గవ శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని అంజన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తూర్పు ఆంజనేయ స్వామి, పడమటి వీరాంజనేయస్వామి, కోతి సమాధి ఆంజనేయస్వామి, పీడబ్ల్యూ కాలనీ ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాస చివరి శనివారం కావడంతో అంజన్నకు ఆకు పూజలు, తోమాల సేవా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో తాళాల భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా ఆంజనేయ స్వామి గ్రామోత్సవం

వీరపునాయునిపల్లె: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఆంజనేయ స్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఆలయ అర్చకుడు రాఘవేంద్ర శర్మ స్వామి ఉత్సవ విగ్రహాన్ని అత్యంత సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బానాయుడు దగ్గరుండి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ట

పెండ్లిమర్రి: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం తహసీల్దార్ ఉదయబాస్కర్ రాజు ఆధ్వర్యంలో వెయ్యినూతలకోన దేవస్థానం ఆలయ ధర్మకర్త నరసింహ హరిప్రసాద్, వేదపండితుల సమక్ష్యంలో ఘనంగా దత్తాత్రేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ముందుగా వేదపండితులు హోమం, ఆకుపూజ,గణపతిపూజ, ప్రత్యేక పూజలు, చేపట్టి అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి,ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.